క్లుప్తంగా

143 మద్యం సీసాలు ధ్వంసం



మద్యంను ధ్వంసం చేస్తున్న పోలీస్, ఎక్సైజ్ అధికారులు

పూసపాటిరేగ: పూసపాటిరేగ పోలీస్‌స్టేషన్ పరిధిలో వివిధ కేసుల్లో పట్టుబడిన 143 మద్యం సీసాలను ఎక్సైజ్ అసిస్టెంట్ సూపరింటెండెంట్ డి.విజయగజపతిరాజు ఆధ్వర్యంలో ఎక్సైజ్, సివిల్ పోలీసులు గురువారం ధ్వంసం చేశారు. కార్యక్రమంలో భోగాపురం రూరల్ సీఐ బి.వెంకటేశ్వరరావు, పూసపాటిరేగ ఎస్‌ఐ ఎ.సన్యాసినాయుడు, వీఆర్వో డి.రామకృష్ణ, తదితరులు ఉన్నారు.

వేతన బకాయిలు చెల్లించాలని డిమాండ్



ఎంఈఓ కార్యాలయ సిబ్బందికి వినతి పత్రం అందజేస్తున్న యూనియన్ నాయకులు

విజయనగరం ఫూల్‌బాగ్: ప్రభుత్వ పాఠశాలల్లో పనిచేస్తున్న ఆయాలకు మూడు నెలల బకాయి వేతనాలు తక్షణమే చెల్లించాలని సీఐటీయూ నాయకుడు ఎ.జగన్‌మోహన్‌రావు డిమాండ్ చేశారు. యూనియన్ ఆధ్వర్యంలో గురువారం మండల విద్యాశాఖాధికారి కార్యాలయ సిబ్బందికి వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఎన్నికల విధుల్లో పాల్గొన్న వారికి రెమ్యూనరేషన్ చెల్లించాలని కోరారు. కార్యక్రమంలో పద్మ, గౌరీ, ఆదిలక్ష్మి, మంగమ్మ, లీల, లక్ష్మి, లత, సత్యవతి, తదితరులు పాల్గొన్నారు.

మాదక ద్రవ్యాలకు దూరంగా ఉండాలి



విద్యార్థులనుద్దేశించి మాట్లాడుతున్న సీఐ కుమార్

నెల్లిమర్ల: విద్యార్థులు మాదకద్రవ్యాలకు, చెడు అలవాట్లకు దూరంగా ఉండాలని ఎస్‌ఈబీట సీఐ పీటీవి కుమార్ అన్నారు. అంతర్జాతీయ మాదక ద్రవ్యాల రవాణా వ్యతిరేకదినోత్సాన్ని పురస్కరించుకుని స్థానిక సీకేఎం ప్రభుత్వ జూనియర్ కళాశాలలో ప్రిన్సిపల్ మజ్జి సత్యనారాయణ ఆధ్వర్యంలో గురువారం అవగాహన కార్యక్రమం జరిగింది. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మంచి ప్రణాళికతో చదువుకుని ఉన్నత శిఖరాలు అధిరోహించాలని ఆకాంక్షించారు. కార్యక్రమంలో అధ్యాపకులు చంద్రశేఖర్, సంధ్య, అప్పారావు, ఎస్‌ఈబీ ఎస్‌ఐ కె.కళ్యాణి, సిబ్బంది భాస్కరరావు, తదితరులు పాల్గొన్నారు.

గో అక్రమ రవాణాకు అడ్డుకట్ట వేయండి



బొండపల్లి: గోవులు అక్రమ రవాణాకు అడ్డుకట్ట వేసేందుకు అధికారులతో పాటు, పోలీసులు చర్యలు తీసుకోవాలని, అక్రమరవాణా చేస్తున్న వారిపై కఠిన చర్యలు తీసుకోవాలని ఏపీ గోసంరక్షణ సమా ఖ్య రాష్ట్ర అధ్యక్షు డు లోగిశ రామ కృష్ణ డిమాండ్ చేశారు. బొండపల్లి మండల కేంద్రంలోని ప్రభుత్వ కార్యాలయాల సముదాయం వద్ద గోసంరక్షణ సమాఖ్య సభ్యులు గురువారం నిరసన తెలిపారు. అనంతరం కార్యాల యాల ప్రాంగణంలో ఉన్న అంబేడ్కర్ విగ్రహానికి వినతిపత్రం అందజేశారు. ఈసందర్భంగా రామకృష్ణ మాట్లాడుతూ గజపతినగరం నియోజకవర్గంలోని మానాపురంలో ప్రతీ శనివారం పశువుల సంత నిర్వహిస్తుంటారని, ఈ సంతకు మన రాష్ట్రంతో పాటు ఒడిశా, తెలంగాణ రాష్ట్రాల నుంచి పశువులను విక్రయించేందుకు తీసుకువ స్తుంటారని, మళ్లీ వీటిని అక్రమంగా ఇతర రాష్ట్రాలకు తరలించడం జరుగు తోందన్నారు. సంబంధిత అధికారులతో పాటు,పోలీసులు జోక్యం చేసుకోని గోవుల అక్రమరవాణాను అరికట్టాల్సిన బాధ్యత ఉందన్నారు. అధికారులు స్పందించకుంటే రాష్ట్ర వ్యాప్తంగా ఆందోళనలు చేపడతామని తెలిపారు. గోసంరక్షణ సమాఖ్య రాష్ట్ర కార్యవర్గ సభ్యులు కె.వి.ఆర్.సూర్యనారాయణ, జిల్లా మహిళా విభాగం అధ్యక్షురాలు చోళ్ల రాజకుమారి, గోసంరక్షణ సమాఖ్య విజయనగరం పట్టణ అధ్యక్షుడు మద్దిల సోంబాబు, కార్యదర్శి రెడ్డి రవిశంకర్, సభ్యులు నీలాపు దేవి,యు.పైడితల్లి పాల్గొన్నారు.

‘ఆణిముత్యాల’పై నీలినీడలు

- ప్రతిభావంతులకు ప్రోత్సాహం దక్కేనా..?
- గతేడాది పది టాపర్లకు రూ.లక్ష నగదు బహుమతి
- జిల్లా, నియోజకవర్గాల స్థాయి విజేతలకూ ప్రోత్సాహకాలు
- ఈ ఏడాది ఇంతవరకూ అందని మార్గదర్శకాలు



పాఠశాల విద్యార్థులు

విజయనగరం: ప్రతిభ గల విద్యార్థులను ప్రోత్సహించేందుకు గత వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం అమలు చేసిన ఆణిముత్యాల పథకంపై నీలినీడలు అలుముకున్నాయి. ప్రభుత్వ పాఠశాలల్లో చదవుకుని ఉత్తమ మార్కులు సాధించిన విద్యార్థులను ప్రోత్సహించేందుకు అమలు చేసిన కార్యక్రమం ఈ విద్యా సంవత్సరంలో అమలుపై ఎటువంటి మార్గదర్శకాలు విడుదల కాకపోవడంతో అటు విద్యార్థులు, ఇటు ఉపాధ్యాయ వర్గాల్లో సందిగ్ధత కొనసాగుతోంది. ప్రభుత్వ విద్యారంగాన్ని అభివృద్ధి పథంలో నడపడానికి, ప్రభుత్వ పాఠశాలల్లో చదివే విద్యార్థుల్లో ప్రతిభావంతులను ప్రోత్సహిం చడానికి ఉద్దేశించి గత ప్రభుత్వం పదవ తరగతిలో అత్యుత్తమ ప్రతిభ చూపిన వారికి ఆణిముత్యాల పేరిట నగదు ప్రోత్సాహకాలు అందించింది. ఈ పథకాన్ని ఏటా అమలు చేయనున్నట్టు గత ప్రభుత్వం స్పష్టం చేసింది. దీంతో 2023-24 విద్యా సంవత్సరంలో ప్రభుత్వ పాఠశాలల్లో చదివే విద్యార్థులు పట్టుదలతో చదివి ఉత్తమ ఫలితాలు సాధించారు. ఈ ఏడాది కూడా నగదు ప్రోత్సాహకాలు అందుతాయని భావించారు. పదో తరగతి విద్యార్థులకు మాత్రమే కాకుండా ప్రభుత్వ జూనియర్ కళాశాలల్లో చదివే విద్యార్థులకు సైతం ఈ ప్రోత్సాహకాలు అందించారు. ప్రతి గ్రూపులో టాపర్లను ఎంపిక చేసి వారికి ఈ ప్రోత్సాహకాలు అందించారు. ఆణిముత్యాలుగా ఎంపికైన విద్యార్థులు చదువుతున్న పాఠశాలల్లో ఉపాధ్యాయులను, నగదు పురస్కారం అందుకున్న విద్యార్థుల తల్లిదండ్రులను కూడాప్రభుత్వం ఘనంగా సత్కరించి గౌరవించింది.

గత ఏడాది టాపర్లకు రూ.లక్ష బహుమతి

ప్రభుత్వ పాఠశాలల్లో 10వ తరగతి, ప్రభుత్వ జూనియర్ కళాశాలల్లో ఇంటర్ వివిధ గ్రూపులు చదివిన విద్యార్థుల్లో ప్రథమ స్థానంలో నిలిచిన విద్యార్థులను ఎంపిక చేసి టాపర్లకు రూ.లక్ష నగదు ప్రోత్సాహకం అప్పటి సీఎం వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి స్వయంగా అందజేశారు. ద్వితీయ స్థానంలో నిలిచిన వారికి రూ.75 వేలు, తృతీయ స్థానంలో నిలిచిన వారికి రూ. 50 వేలు అందచేశారు. ఇంటర్ విద్యార్థులకూ అమలు చేశారు. ఇంటర్మీడియట్ ఎంపీసీ, బైపీసీ, హెచ్ఈసీ, సీఈసీ/ఎంఈసీ వంటి ప్రతి గ్రూపులో టాపర్లకు నగదు బహుమతులు అందజేశారు. నగదు పురస్కారంతో పాటు సర్టిఫికెట్, మెడల్స్ కూడా ఇచ్చి విద్యార్థులను ప్రోత్సహించారు.

జిల్లా, నియోజకవర్గ స్థాయిల్లో సత్కారం

జిల్లా, నియోజకవర్గాల స్థాయిలో ప్రోత్సాహకాలు విజేతలకు నగదు ప్రోత్సాహకాలు కేవలం రాష్ట్ర స్థాయికే పరిమితం చేయకుండా నియోజకవర్గ, జిల్లా స్థాయికి వర్తింపజేశారు. నియోజకవర్గ స్థాయి టాపర్లకు రూ.15 వేలు, ద్వితీయ స్థానంలో రూ.10 వేలు, తృతీయ స్థానంలో నిలిచిన వారికి రూ.5 వేలు అందజేశారు. జిల్లా స్థాయిలో టాపర్లకు రూ.50 వేలు, ద్వితీయ స్థానం రూ.30 వేలు, తృతీయ స్థానంలో నిలిచిన వారికి రూ.15 వేలు అందించారు. ఈ రెండు స్థాయిల్లో కూడా ఇంటర్మీడియట్ విద్యార్థులకు ప్రోత్సాహకాలు అందించారు. జగనన్న స్ఫూర్తితో కొన్ని ప్రాంతాల్లో స్థానిక దాతల సహకారంతో పాఠశాల స్థాయిలో టాపర్లకు నగదు పురస్కారం అందింది. పాఠశాల స్థాయిలో ప్రథమ స్థానానికి రూ.3 వేలు, ద్వితీయ స్థానానికి రూ.2 వేలు, తృతీయ స్థానానికి రూ.వెయ్యి నగదు బహుమతులు అందజేశారు.

ఈ ఏడాది అందని మార్గదర్శకాలు

ప్రభుత్వ పాఠశాలలు, కళాశాలల్లో చదివే విద్యార్థుల్లో పోటీతత్వాన్ని పెంచి వారి భవిష్యత్తును ఉన్నతంగా తీర్చిదిద్దాలనే లక్ష్యంతో అమలు చేసిన ఆ పథకానికి గత ఏడాది తల్లిదండ్రులు, ఉపాధ్యాయుల నుంచి గొప్ప స్పందన లభించింది. గతంలో ఏ ప్రభుత్వం ఇలాంటి కార్యక్రమం చేపట్టలేదని, ఈ పథకాన్ని భవిష్యత్తులో కూడా కొనసాగించాలని కోరారు. గత ఏడాది జూన్ 20 నాటికి అన్ని స్థాయిల్లో నగదు ప్రోత్సాహకాలు అందించే కార్యక్రమాలు పూర్తి చేశారు. ఈ ఏడాది విద్యార్థులకు ఇలాంటి నగదు పురస్కారం అందుతుందా లేదా అనేది ప్రశ్నార్థకంగా మారింది. ఈ విషయంపై విద్యాశాఖ రాష్ట్ర కార్యాలయం నుంచి ఎలాంటి ప్రకటన వెలువడలేదు. విద్యాశాఖ అధికారులకు ఎటువంటి మార్గదర్శకాలూ అందకపోవడంతో ఈ ఏడాది నగదు ప్రోత్సాహకాలు ఇస్తారా? లేదా? అన్నది సందేహంగా కనిపిస్తోంది.

పారిశుద్ధ్య నిర్వహణపై నిరంతర పర్యవేక్షణ

- కార్పొరేషన్ కమిషనర్ ఎం.మల్లయ్యనాయుడు



ఘోష ఆస్పత్రి ప్రాంతంలో పారిశుద్ధ్య పనులు పర్యవేక్షిస్తున్న కమిషనర్ మల్లయ్యనాయుడు

విజయనగరం: నగరంలోని వీధుల్లో పారిశుద్ధ్య నిర్వహణను నిరంతరం పర్యవేక్షించాలని శానిటరీ ఇన్‌స్పెక్టర్లు, కార్యదర్శులకు విజయనగరం కార్పొరేషన్ కమిషనర్ ఎం.ఎం.నాయుడు ఆదేశించారు. విజయనగరం 11వ డివిజన్‌లో పారిశుద్ధ్య నిర్వహణ తీరును గురువారం పరిశీలించారు. ఘోష ఆస్పత్రి, అశోక్ నగర్, బూడి వీధి తదితర ప్రాంతాల్లో పర్యటించారు. ఆయా ప్రాంతాల్లో పారిశుద్ధ్య నిర్వహణ సక్రమంగా లేకపోవడంతో సంబంధిత పారిశుద్ధ్య పర్యవేక్షకునిపై ఆగ్రహం వ్యక్తం చేశారు. పశువుల వ్యర్థాలను కాలువలో వేయడం వల్ల క్రిమికీటకాలు పెరుగుతున్న విషయాన్ని గమనించాలన్నారు. వీధుల్లోని దుకాణాల వద్ద వ్యర్థాలు ఎక్కువగా ఉండడం పట్ల అసహనం వ్యక్తం చేశారు. డస్ట్‌బిన్లు తప్పనిసరిగా వినియోగించుకోవాలని దుకాణదారులకు సూచించారు. వీధుల పరిశుభ్రతలో ప్రతి ఒక్కరూ భాగస్వాములు కావాలన్నారు. ప్రజల్లో మరింత చైతన్యం తీసుకొచ్చి చెత్తా చెదారాలు బహిరంగంగా పడవేయకుండా చూడాలన్నారు. చెత్తబుట్టలు వినియోగించుకునేలా అవగాహన పెంచాలన్నారు.

బస్ డ్రైవర్ మృతికి సంతాపం



చిన్నారావు చిత్రపటానికి నివాళులర్పిస్తున్న యూనియన్ నాయకులు

విజయనగరం ఫూల్‌బాగ్: ఏపీ పీటీడీ ఎయిర్ బస్ వర్కర్స్ యూనియన్ (సీఐటీయూ) మాజీ కోశాధికారి, బస్సు డ్రైవర్ వై.చిన్నారావు మృతికి యూనియన్ సభ్యులు గురువారం సంతాపం తెలిపారు. ఆర్టీసీ కాంప్లెక్స్‌లోని యూనియన్ కార్యాలయం వద్ద చిన్నారావు చిత్రపటానికి సీఐటీయూ జిల్లా ప్రధాన కార్యదర్శి కె.సురేష్, యూనియన్ గౌరవాధ్యక్షుడు జగన్‌మోహన్‌రావు, ఎస్‌డబ్ల్యూఎఫ్ రాష్ట్ర కార్యదర్శి వి.రాములు పూలమాలలు వేసి నివాళులర్పించారు. చిన్నారావు కుటుంబానికి అండగా ఉంటామన్నారు. ఉద్యోగులందరూ ఆర్థిక సాయం చేయాలని కోరారు. సంతాపం తెలిపిన వారిలో మధు, వాసు, జగదీష్, తదితరులు ఉన్నారు.

నీటిని పొదుపుగా వాడుకుందాం

దత్తిరాజేరు: ప్రతి నీటి బొట్టు ఎంతో విలువైనదని, నీటిని వృథా చేయకుండా పొదుపుగా వాడుకుందామని ఎంఈఓ ఎం.వెంకటరావు అన్నారు. ‘సేవ్ వాటర్’కార్యక్రమంలో భాగంగా స్థానిక కస్తుర్బా గాంధీ బాలికల విద్యాలయం(కేజీబీవీ) విద్యార్థినులతో కలిసి గురువారం అవగాహన ర్యాలీ నిర్వహించారు. కేజీబీవీ నుంచి తహసీల్దార్ కార్యాలయం వరకు ర్యాలీ కొనసాగింది. ఈసందర్భంగా ఎంఈఓ మాట్లాడుతూ మానవునితో పాటు సకల జీవరాశుల మనుగడకు నీరే ప్రాణాధారమని అన్నారు. భవిష్యత్ తరాల కోసం నీటిని పొదుపు చేయాల్సిన అవసరం ఉందన్నారు.

బ్రహ్మకుమారీస్ ఆధ్వర్యంలో యోగాడే



యోగాసనాలు వేస్తున్న పట్టణ వాసులు

విజయనగరం టౌన్: విజయనగరం కంటోన్మెంట్‌లో ఉన్న ప్రజాపిత ఈశ్వరీయ విశ్వవిద్యాలయం ఆవరణలో అంతర్జాతీయ యోగా దినోత్సవాన్ని గురువారం నిర్వహించారు. బ్రహ్మకుమారీస్ జిల్లా ఇన్‌చార్జి బి.కె.అన్నపూర్ణ యోగా విశిష్టతను వివరించారు. ఆధ్యాత్మికత అంశాలను బోధిస్తూ యోగాసనాలు సాధన చేయించారు. కార్యక్రమంలో అధిక సంఖ్యలో పట్టణవాసులు పాల్గొన్నారు.



యోగాసనాలపై తర్ఫీదునిస్తున్న బ్రహ్మకుమారీస్ జిల్లా ఇన్‌చార్జి అన్నపూర్ణ

ప్రకృతి పులకింత



విజయనగరం జిల్లా కేంద్రంలోని పెద్ద చెరువు పరిసరాలు నగరవాసులకు ఆహ్లాదాన్ని, ఆనందాన్ని పంచుతున్నాయి. ఇక్కడ అభివృద్ధి చేసిన ఆచంట గార్డెన్ పచ్చని పట్టుచీర కట్టుకుని ప్రజలకు స్వాగతం పలుకుతోంది. రంగురంగుల పూల చెట్లు కనువిందు కలిగిస్తున్నాయి. పర్యాటకులు, పర్యావరణ ప్రేమికులను మురిపిస్తున్నాయి.

– సాక్షిఫొటోగ్రాఫర్, విజయనగరం

హోంగార్డుకు చేయూత

విజయనగరం క్రైమ్: జిల్లా పోలీస్ శాఖలో హోంగార్డుగా ఎంపికై విశాఖ స్టీల్ ప్లాంట్‌లో డిప్యుటేషన్‌పై విధులు నిర్వహించి, ఇటీవల ఉద్యోగ విరమణ చేసిన కె.భరికకు చేయూతగా హోంగార్డ్స్ అందించిన ఒక్కరోజు అలవెన్స్ రూ.3 లక్షల 25వేల 890 చెక్కును ఎస్పీ ఎం.దీపిక తన చాంబర్‌లో గురువారం అందజేశారు. కార్యక్రమంలో హోంగార్డ్స్ ఆర్ఐ రమేష్‌కుమార్, కార్యాలయ పర్యవేక్షకులు ప్రభాకరరావు, తదితరులు పాల్గొన్నారు.



ఉద్యోగ విరమణ చెందిన భరికకు చేయూత చెక్కు అందజేస్తున్న ఎస్పీ ఎం.దీపిక

ప్రశంసల జల్లు

పూసపాటిరేగ/విజయనగరం టౌన్: ఎన్నికల విధుల్లో ఉత్తమ సేవలందించిన పోలీస్ అధికారులు, సిబ్బందిని ఎస్పీ ఎం.దీపికా పాటిల్ ఎస్పీ కార్యాలయంలో బుధవారం నిర్వహించిన న్యాయ సమీక్ష సమావేశంలో సత్కరించారు. ప్రశంసా పత్రాలు, ప్రోత్సాహక బహుమతులు అందజేశారు. ప్రశంసా పత్రాలు అందుకున్న విజయనగరం ట్రాఫిక్ సీఐ పి.రంగనాథం, పూసపాటిరేగ ఎస్‌ఐ ఎ.సన్యాసినాయుడుకు ఆయా స్టేషన్ల సిబ్బంది గురువారం అభినందనలు తెలిపారు.



సీఐ రంగనాథం, ఎస్‌ఐ సన్యాసినాయుడుకు ప్రశంసా పత్రాలు అందజేస్తున్న ఎస్పీ ఎం.దీపిక

రక్తదానం ప్రాణదానంతో సమానం



గోవిందపురంలో మెగా రక్తదాన శిబిరంలో పాల్గొన్న యువత

పూసపాటిరేగ: రక్తదానం ప్రాణదానంతో సమానమని, ఆపదలో ఉన్నవారిని ఆదుకోవచ్చని గోవిందపురం సర్పంచ్ బాలా రామలక్ష్మి అన్నారు. గోవిందపురం గ్రామంలో వైస్ సర్పంచ్ బాలా అప్పలరాజు జన్మదినం సందర్భంగా విజయనగరం యూత్ ఫౌండేషన్, గోవిందపురం యూత్ ఆధ్వర్యంలో గురువారం మెగా రక్తదాన శిబిరం నిర్వహించారు. 93 మంది యువత శిబిరంలో రక్తదానం చేశారు. ఈ సందర్భంగా సర్పంచ్ మాట్లాడుతూ ప్రమాదాల్లో గాయపడిన వ్యక్తులు, శస్త్రచికిత్స చేసుకున్న వ్యక్తులకు రక్తం సకాలంలో అందక ప్రాణాలు కోల్పోతున్నారన్నారు. ప్రతి ఒక్కరూ రక్తదానం చేసి ప్రాణాలు కాపాడాలని సూచించారు. 18 సంవత్సరాలు నిండిన ప్రతిఒక్కరూ రక్తదానం చేయవచ్చన్నారు. అనంతరం గోవిందపురం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో 450 మంది విద్యార్థులకు స్టేషనరీని పంపిణీ చేశారు. కార్యక్రమంలో గోవిందపురం జిల్లాపరిషత్ ఉన్నత పాఠశాల హెచ్ఎం శైలజారాణి, విజయనగరం యూత్ ఫౌండేషన్ అధ్యక్ష, కార్యదర్శులు షేక్ ఇలామష్, అశోక్, విజయాబ్యాంకు మేనేజర్ శివ, తదితరులు పాల్గొన్నారు.

రామతీర్థంలో ‘నేను బడికిపోతా’



రామతీర్థంలో నిర్వహించిన నేను బడికిపోతా అవగాహన ర్యాలీ

నెల్లిమర్ల రూరల్: మండలంలోని రామతీర్థం ఉన్నత పాఠశాల నేను బడికిపోతా కార్యక్రమంపై స్కూల్ కాంప్లెక్స్ పరిధిలో ఉన్న ప్రధానోపాధ్యాయులతో గురువారం సమావేశం నిర్వహించారు. స్కూల్ కాంప్లెక్స్ చైర్మెన్, హెచ్ఎం ఎస్ఆర్ రామలింగ శాస్త్రి మాట్లాడుతూ బడిబయట ఉన్న పిల్లలను గుర్తించి బడిలో చేర్పించాలని కోరారు. వయసుకు తగిన తరగతుల్లో విద్యార్థులను చేర్పించేందుకు కృషి చేయాలన్నారు. ప్రభుత్వ పాఠశాలల్లో నాణ్యమైన విద్య అందుతుందని, అన్ని సౌకర్యాలు విద్యార్థులకు అందుబాటులో ఉన్నాయన్న విషయం తెలియజెప్పాలన్నారు. అనంతరం గ్రామంలో ర్యాలీ నిర్వహించి చదువు ఆవశ్యకతపై అవగాహన కల్పించారు.

మెరుగైన వైద్యసేవలందించండి

- ఎన్‌క్యూఏఎస్ ప్రతినిధులు డాక్టర్ జోసఫ్, అశోక్ కుమార్

గంట్యాడ: గ్రామ స్థాయిలో ప్రజలకు వైద్య సేవలు అందించాలని ఎన్‌క్యూఏఎస్ (నేషనల్ క్వాలిటీ అస్సూరెన్స్ స్టాండర్డ్) ప్రతినిధులు డాక్టర్ జోసఫ్, డాక్టర్ అశోక్‌కుమార్ సూచించారు. మండలంలోని కొర్లాం హెల్త్ వెల్‌నెస్ సెంటర్‌ను వారు గురువారం పరిశీలించారు. వెల్‌నెస్ సెంటర్‌లో రోగులకు అందిస్తున్న సేవలు గురించి ఆరా తీశారు. ఏఏ వ్యాధులతో ఎక్కువగా రోగులు వస్తున్నారు, వారికి అందిస్తున్న చికిత్స, మందులు గురించి ఆరా తీశారు. ఈ కార్యక్రమంలో ఎంపీహెచ్ఈఓ కె.ఎర్రన్న, తదితరులు పాల్గొన్నారు.



కొర్లాం వెల్‌నెస్ సెంటర్ సిబ్బందితో మాట్లాడుతున్న డాక్టర్ జోసఫ్, డాక్టర్ అశోక్‌కుమార్

సైబర్ నేరాలపై అవగాహన అవసరం

చీపురుపల్లిరూరల్(గరివిడి): రోజు రోజుకూ పెరిగిపోతున్న సైబర్ నేరాలపై ప్రతి ఒక్కరూ అప్రమత్తంగా ఉంటూ, అవగాహన కలిగి ఉండాలని లీడ్ బ్యాంకు డిస్ట్రిక్ట్ ఇన్‌చార్జ్ మేనేజర్ ప్రత్యూష అన్నారు. రిజర్వ్ బ్యాంకు ఆఫ్ ఇండియా సూచనలతో గరివిడిలోని మహిళా సమాఖ్య కార్యాలయంలో స్వయం సహాయక సంఘాల సభ్యులకు బ్యాంకింగ్ సేవలపై గురువారం అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ బ్యాంకింగ్ సేవలు, ఖాతాల నిర్వహణ గురించి తెలుసుకోవాలని అన్నారు. అపరిచిత వ్యక్తులు ఫోన్‌చేసి బ్యాంకు ఖాతా, ఏటీఎం పిన్ వివరాలు అడిగితే చెప్పవద్దని సూచించారు. ఫేక్ మెసేజ్‌లు, మెయిల్స్‌కు స్పందించవద్దని చెప్పారు.ఎలాంటి సందేహాలున్నా నేరుగా బ్యాంకులకు వెళ్లి నివృత్తి చేసుకోవాలని తెలిపారు.డీఆర్‌డీఏ ఏపీడీ కె.సావిత్రి, డీపీఎం ఎల్.హెచ్. రాజ్‌కుమార్, గరివిడి వెలుగు ఏరియా కో–ఆర్డినేటర్ బంగారమ్మ, ఏపీఎం పద్మ, రిసోర్స్ పర్సన్ ఫణికుమార్, ట్రైనర్లు సూరిబాబు,సాయిబాబా పాల్గొన్నారు.



అవగాహన కల్పిస్తున్న లీడ్ బ్యాంకు డిస్ట్రిక్ట్ ఇన్‌చార్జ్ మేనేజర్ ప్రత్యూష

వేంకటేశ్వరస్వామికి తులాభారం సేవ



భీమసింగి సుగర్ ఫ్యాక్టరీ వద్ద వేంకటేశ్వరస్వామి ఆలయంలో బ్రహ్మోత్సవాల్లో భాగంగా వేదపండితుల ఆధ్వర్యంలో స్వామి వారి తులాభారం సేవను బుధవారం రాత్రి శాస్త్రోక్తంగా నిర్వహించారు. ముందుగా స్వామివారికి ప్రత్యేక పూజలు, అభిషేకాలు చేశారు. అనంతరం పటిక బెల్లంతో భక్తులు స్వామివారికి తులాభారం వేసి మొక్కులు చెల్లించుకున్నారు. – జామి